అపర భగీరథుడు కేసీఆర్

మల్లన్న సాగర్ వద్ద మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాంరెడ్డి

తొగుట, ఆగస్టు 8: కరువు కాటకాలతో విలవిల్లాడిన తెలంగాణ మాగాణిలో గోదావరి జలాలతో సస్యశ్యామలం చేయించిన ఘనత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి పేర్కొన్నారు. మల్లన్న సాగర్‌లో గోదావరి జలాల విడుదల సందర్భంగా పార్టీ శ్రేణులతో కలిసి ప్రాజెక్టు వద్ద గోదారమ్మకు పూలు, పసుపు కుంకుమలతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 60 ఏండ్ల సమైక్యాంధ్ర పాలనలో గోదావరి జలాలు సముద్రం పాలయినా ఎవరూ పట్టించుకోలేదని, కేసీఆర్ ముఖ్యమంత్రి కాగానే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టి కేవలం మూడున్నర ఏండ్లలో పూర్తి చేశారన్నారు. బీఆర్ఎస్ ఒత్తిడి మూలంగానే ప్రభుత్వం తలొగ్గి నీటిని విడుదల చేసిందన్నారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు చెరుకు లక్ష్మారెడ్డి, నాయకులు వెల్పుల స్వామి, రాజిరెడ్డి, స్వామి, శ్రీనివాస్, పిట్ల వెంకటయ్య, లక్ష్మారెడ్డి, సంతోష్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, స్వామిగౌడ్, రమేశ్ గౌడ్, పరశురాములు, శంకరయ్య, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల్లో మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలి



ధర్నా చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు

కొండపాక (కుకునూరుపల్లి), ఆగస్టు 8 : గ్రామ పంచాయతీల్లో వివిధ విభాగాల్లో పెట్టిన మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని గురువారం ఒక్క రోజు సఫాయి బంద్ నిర్వహించడంతో పాటు గ్రామ పంచాయతీ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ పిలుపు మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో మండల ఐవోసీ భవనం ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు బాలనర్సయ్య, సంఘం జిల్లా కొమురయ్య, నాయకులు శ్రీనివాస్, జాలిగామ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై నాటు వేసి గ్రామస్తుల నిరసన

కొండపాకలో బురదమయంగా ఉన్న రోడ్డుపై నాట్లు వేస్తున్న గ్రామస్తులు

కొండపాక (కుకునూరుపల్లి), ఆగస్టు 8 : కొండపాక మండల కేంద్రంలో బురదమయంగా మారిన రోడ్డుపై గ్రామస్తులు నాటు వేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొండపాక అభివృద్ధిలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా ఇండ్లను కూల్చి చేపట్టిన రోడ్డు పనులు ఎక్కడికక్కడే ఉన్నాయని ఆరోపించారు. ఇటీవల గ్రామానికి వచ్చిన కలెక్టర్ దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లినా పురోగతి లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులు పూర్తి చేయాలని లేనిపక్షంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బాలచందర్‌గౌడ్, స్వామి, నర్సింహాచారి, నాగార్జున, యాదగిరి, రమేశ్, హరీశ్‌గౌడ్, శేఖర్, బాలకిషన్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

వయనాడ్ బాధితులకు విరాళాల సేకరణ

చేర్యాలలో విరాళాలు సేకరిస్తున్న సీపీఐ నాయకులు

చేర్యాల, ఆగస్టు 8 : భారీ వర్షాలతో కొండ చరియలు విరిగి పడి అస్తవ్యస్తంగా మారిన కేరళ రాష్ట్రంలోని వయనాడ్ వరద బాధితుల కోసం పట్టణంలో గురువారం సీపీఐ ఆధ్వర్యంలో విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు అశోక్, నాయకులు భూమయ్య, యాదగిరి, మమత, అంజయ్య, సుదర్శన్, కనకయ్య, నరేందర్, స్వామిదాసు, పోషయ్య, ఎల్లయ్య, రాజు, మహేశ్వరి పాల్గొన్నారు.

నైపుణ్య శిక్షణ తప్పనిసరి

■కలెక్టర్ మనుచౌదరి ■ఐటీ టవర్ సందర్శన

ఐటీ టవర్‌లో పర్యటిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట, ఆగస్టు 8 : యువతకు నైపుణ్య శిక్షణ తప్పనిసరి అని కలెక్టర్ మనుచౌదరి అన్నారు. నాగులబండ వద్ద ఉన్న ఐటీ టవర్‌ను గురువారం కలెక్టర్ సందర్శించారు. ఈ ఐటీ టవర్‌లో వివిధ సాఫ్ట్‌వేర్ కంపెనీలు సిద్దిపేట, చుట్టుపక్కల జిల్లాల నుంచి విచ్చేసిన యువతీ యువకులకు ఇక్కడ శిక్షణ ఇచ్చి వారికి ఉద్యోగం కల్పిస్తుందని ఐటీ టవర్ యాజమాన్యం కలెక్టర్‌కు వివరించారు. టాస్క్ సాఫ్ట్‌వేర్ ట్రైనింగ్ సెంటర్‌లో యువతతో కలెక్టర్ కాసేపు ముచ్చటించారు. నూతన ఒరవడులను అందిపుచ్చుకొని జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. ఐటీ టవర్ ఆవరణలో రాజీవ్ రహదారిపై రిక్వెస్ట్ స్టాప్‌లో బస్సులు ఆపాలని కోరగా వెంటనే ఆర్టీసీ డీఎంతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. రాత్రి వేళల్లో ఇబ్బంది కలగకుండా రోడ్డుపై స్ట్రీట్ లైట్ అమర్చాలని కోరగా కలెక్టర్ వాటికి సానుకూలంగా స్పందించారు. కలెక్టర్ వెంట టీఎస్ ఐఐసీ డీ ఈ జ్యోతి, టీ–హబ్ ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

వేస్ట్ మేనేజ్‌మెంట్ సెంటర్ పరిశీలన

సిద్దిపేట, ఆగస్టు 8 : సిద్దిపేట రూరల్ మండలంలోని బుస్సాపూర్‌లో ఉన్న సాలిడ్ లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ సెంటర్‌ను కలెక్టర్ మనుచౌదరి, అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. టీహబ్ ప్రతినిధి అక్షయ్ బృందానికి ఈ సెంటర్ ఉద్దేశంపై అధికారులు వివరించారు. సిద్దిపేట మున్సిపల్‌లోని ప్రతి ఇంటి నుంచి రోజు ట్రాక్టర్లలో తీసుకొచ్చిన చెత్త నుంచి ఎరువు తయారు చేసే విధానం, ప్లాస్టిక్ రీప్రాసెసింగ్ యూనిట్, ద్రవ వ్యర్థాల ద్వారా తయారయ్యే బయో–గ్యాస్ ప్లాంట్లను పరిశీలించారు. వీరి వెంట డీఆర్‌డీవో జయదేవ్ ఆర్య, మెప్మా పీడీ హనుమంత్‌రెడ్డి, సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ప్రేరణ, ఏఈ అవినాశ్, మున్సిపల్ సానిటరీ ఇన్‌స్పెక్టర్ సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

స్పందించారు.. మొరం వేయించారు

గజ్వేల్, ఆగస్టు 8 : నమస్తేలో ప్రచురితమైన 'అధ్వానంగా రోడ్లు'కు స్పందించిన అధికారులు మండల పరిధిలోని అహ్మదీపూర్ ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదుట బురదమయంగా మారిన రోడ్డుపై గురువారం మొరం పోయించి చదును చేశారు. పాఠశాల ముందు నుంచి నడవడం ఇబ్బందిగా మారడంతో విద్యార్థులు, గ్రామస్తులను దృష్టిలో ఉంచుకొని పంచాయతీ కార్యదర్శి కుమారస్వామి మొరం పోయించారు. అధ్వాన్నంగా రోడ్లు కథనానికి అధికారులు స్పందించడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

పండుగ సాయన్నకు ఘన నివాళి

పండుగ సాయన్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

హుస్నాబాద్‌టౌన్, ఆగస్టు 8: హుస్నాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో గురువారం పండుగ సాయన్న జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జేఏసీ నియోజకవర్గ కోఆర్డినేటర్ మేకల వీరన్నయాదవ్ పండుగ సాయన్న చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకుడు రవీందర్, సీపీఐ మండల కార్యదర్శి మల్లేశ్, జేఏసీ నాయకులు శ్రీనివాస్, సమ్మయ్య, సుందరయ్య, శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, రమేశ్, రాములు, వెంకన్న, కొమురయ్య, వెంకటయ్య తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలను పట్టణానికి తరలించాలి

మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి ప్రశాంత్

చేర్యాల, ఆగస్టు 8 : పట్టణానికి దూరంగా ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలను వెంటనే విద్యార్థులకు అందుబాటులో ఉండేలా టౌన్‌లో ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్ డిమాండ్ చేశారు. పట్టణంలో గురువారం జరిగిన ఎస్ఎఫ్ఐ విస్తృత స్థాయి సమావేశంలో ప్రశాంత్ మాట్లాడుతూ.. ధూళిమిట్ట, మద్దూరు మండల కేంద్రాల్లో మూతపడిన హాస్టళ్లను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షుడిగా రాహుల్, కార్యదర్శిగా భరత్‌కుమార్ ఎన్నికయ్యారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రంజిత్‌రెడ్డి, నాయకులు రాకేశ్‌రెడ్డి, అరవింద్‌రెడ్డి, మధు, ప్రశాంత్, విక్రం, రాజు, హారిక పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పని చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో రామ్మూర్తి

అక్కన్నపేట, ఆగస్టు 8 : హుస్నాబాద్‌ను మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడంలో అధికారులంతా భాగస్వాములు కావాలని హుస్నాబాద్ ఆర్డీవో రామ్మూర్తి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో మండల స్థాయిలో అన్ని ప్రభుత్వ శాఖల పనితీరుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ... ప్రస్తుతం గ్రామాల్లో ప్రజాప్రతినిధులు లేరని, గ్రామ ప్రత్యేకాధికారులు , పంచాయతీ కార్యదర్శులు, ఇతర శాఖలు అధికారులు కలిసి సమన్వయంతో పని చేయాలని సూచించారు. అనంతరం శాఖల వారీగా పెండింగ్ పనులు, సమస్యలు, అవసరాలు వెంటనే నివేదిక తయారు చేసి అందజేయాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి మహేశ్, తహసీల్దార్ అనంతరెడ్డి, ఎంపీడీవో జయరాం, పీఆర్ డీఈ మహేశ్, సీడీపీవో జయమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ రుహీనా తస్కీన్, అన్ని శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లోని నైపుణ్యాలను వెలికితీయాలి

ఉపాధ్యాయుల బోధన పద్ధతులను పరిశీలిస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ దర్శన

ములుగు, ఆగస్టు 8 : విద్యార్థుల్లోని నైపుణ్యాలను వెలికితీసేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎన్‌సీఈఆర్‌టీ అసిస్టెంట్ ప్రొఫెసర్ దర్శన అన్నారు. ములుగు మండల పరిధిలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో ఎన్‌సీఆర్‌టీ ఆధ్వర్యంలో ప్రత్యేక సర్వే నిర్వహించి విద్యార్థుల్లోని నైపుణ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలోని స్వచ్ఛత, భోదనోపకరణాలతో పాఠం చెప్పే విధానం, పిల్లల అల్లరిని అరికట్టడంలో తీసుకుంటున్న శ్రద్ధ, మౌలిక వసతులు, విద్యార్థుల నైపుణ్య సామర్థ్యాలను పరిశీలించినట్లు ఆమె తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తాం

ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు

గజ్వేల్, ఆగస్టు 8: ఎస్‌జీటీ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారిస్తామని ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి అన్నారు. గురువారం గజ్వేల్ మండలంలో చేపట్టిన పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలోని ఆయా పాఠశాలలకు చెందిన ఎస్‌జీటీ ఉపాధ్యాయులు వారికి జరుగుతున్న అన్యాయంపై ఎమ్మెల్సీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు శశిధర్‌శర్మ, గజ్వేల్ మండల అధ్యక్ష, కార్యదర్శులు వేమారెడ్డి, లింగం, నర్సింహారెడ్డి, కనకరాజు, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రావు, పోచయ్య, శ్రీనివాస్, నాగరాజు, వెంకటేశ్, నాగరాజు, భాస్కర్ పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు

మర్కూక్, ఆగస్టు 8 : మండల పరిధిలోని పలు పాఠశాలలో బుధవారం పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు నిర్వహించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల శాఖ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి కుమార్, శ్రీనివాస్‌రావు, లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్‌రెడ్డి, నర్సింహులు, షాబుద్దీన్, యాదిరెడ్డి, సరితాదేవి తదితరులు పాల్గొన్నారు.

సరస్వతి ఆలయంలో చోరీయత్నం

వర్గల్, ఆగస్టు 8: వర్గల్ విద్యాధరిణి సరస్వతీమాత ఆలయంలో బుధవారం రాత్రి దుండగులు చోరీకి విఫలయత్నం చేశారు. ఆలయానికి అత్యంత సమీపంలోని సప్తస్వరాల గుండు మార్గాన ఉన్న ద్వారాన్ని ధ్వంసం చేయడానికి ప్రయత్నించిన దుండగులు తాళం, అర్ధండిలను పగులగొట్టి లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. అంతలోనే సెక్యూరిటీ అలజడితో దుండగులు అప్రమత్తమై అక్కడి నుంచి జారుకున్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న సెక్యూరిటీ సిబ్బంది దర్వాజ తాళం పగులగొట్టిన తీరును ఆలయ నిర్వాహకులు, గౌరారం పోలీసులకు సమాచారం అందించారు. సీసీ ఫుటేజీలను పరిశీలించగా నలుగురు వ్యక్తులు ముసుగులు ధరించి చోరీకి ప్రయత్నించినట్లు తేలింది. ఘటనా స్థలంలో దుండగులు పొడవాటి కత్తిని వదిలివెళ్లారు. ఈ ఘటనపై గౌరారం ఎస్సై కరుణాకర్‌రెడ్డి సిబ్బందితో కలిసి విచారణ చేపట్టారు.

గౌరారం ఎస్సైగా కరుణాకర్‌రెడ్డి

వర్గల్, ఆగస్టు 8: మండల పరిధిలోని గౌరారం నూతన ఎస్సైగా బి.కరుణాకర్‌రెడ్డి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకు ముందు మనోహరాబాద్ ఎస్సైగా పనిచేసిన కరుణాకర్‌రెడ్డి బదిలీపై ఇక్కడికి వచ్చారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

బాధిత కుటుంబానికి చెక్కును అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కొమురవెల్లి, ఆగస్టు 8 : మండల కేంద్రానికి చెందిన గొల్లపల్లి చంద్రయ్య అనారోగ్యంతో గతేడాది దవాఖానలో చికిత్స పొందాడు. నిరుపేద కుటుంబానికి చెందిన చంద్రయ్య విషయం బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏర్పుల మహేశ్ అప్పటి ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లడంతో సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి బాధితుడికి రూ.17,500 మంజూరైంది. ఈ చెక్కును గురువారం బీఆర్ఎస్ నాయకుడు ఏర్పుల మహేశ్, మాజీ జడ్పీటీసీ సిలువేరు సిద్దప్పతో కలిసి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గీస నర్సింహులు, చిగురుపల్లి రాజు, తదితరులు పాల్గొన్నారు.

రవీంద్రనగర్‌లో..

కొండపాక(కుకునూరుపల్లి), ఆగస్టు 8 : మండలంలోని రవీంద్రనగర్‌కు చెందిన కుంచెం నితీన్ రోడ్డు ప్రమాదంలో గాయపడి దవాఖానలో చికిత్స పొందారు. బాధితుడికి మంజూరైన రూ.49,500 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును గురువారం కాంగ్రెస్ జిల్లా ఎస్సీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ కొమ్ము విజయ్ బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మల్లేశం, రవి, భానుచందు తదితరులు పాల్గొన్నారు.

గంగపుత్రుల ధర్నా

కొమురవెల్లి, ఆగస్టు 8 : మండలంలోని పోసాన్‌పల్లిలో ప్రభుత్వ స్థలాన్ని ఇతరుల పేరు మీద చేశారని గంగపుత్రుల సంఘం ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ విషయమై పలుమార్లు ఆర్‌టీఏ కింద సమాచారం కోసం దరఖాస్తు చేసినా ఎలాంటి స్పందన లేదని సంఘం నాయకులు తెలిపారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించాలి

అక్కన్నపేట, ఆగస్టు 8: పెద్దగుబ్బడి గ్రామ పంచాయతీ పరిధిలో సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామస్తులు సహకరించాలని ఎస్సై విజయభాస్కర్ సూచించారు. గురువారం గ్రామాన్ని సందర్శించిన ఎస్సై గ్రామస్తులతో సమావేశమై మాట్లాడారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు.

బియ్యం లారీ పట్టివేత

చేర్యాల, ఆగస్టు 8 : మండలంలోని ముస్త్యాల గ్రామంలో గురువారం రేషన్ బియ్యం లోడ్‌తో వెళ్తున్న లారీని పట్టణానికి చెందిన పలువురు వ్యక్తులు పట్టుకొని చేర్యాల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం రెవెన్యూ అధికారులు బియ్యం లోడ్ ఎక్కడి నుంచి ఎక్కడి వెళ్తుందో ఈ–వేబిల్ తదితర వాటిని పరిశీలించి జిల్లా పౌర సరఫరాల అధికారులకు, జాయింట్ కలెక్టర్‌కు నివేదిక పంపించారు. ఈ విషయమై ఆర్ఐ రాజేందర్‌రెడ్డిని వివరణ కోరగా లారీకి సంబంధించి ఉన్నతాధికారులకు లేఖ పంపిస్తున్నట్లు తెలిపారు.

ఆలయ భూములను పరిరక్షించాలి

మద్దూరు(ధూళిమిట్ట), ఆగస్టు 8 : ధూళిమిట్ట మండలంలోని బెక్కల్ రామలింగేశ్వరస్వామి ఆలయ భూములు పరిరక్షించాలని గ్రామస్తులు గురువారం ఏకగ్రీవ తీర్మానం చేసి, తహసీల్దార్ ఎర్రొళ్ల శ్యామ్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ విషయమై పలుమార్లు రెవెన్యూ అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదన్నారు.

ఓపెన్ స్కూల్‌లో అడ్మిషన్లు ప్రారంభం

హుస్నాబాద్‌టౌన్, ఆగస్టు 8: ఓపెన్ 10వ తరగతి, ఇంటర్‌లో అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం, సెంటర్ కోర్డినేటర్ వాసుదేవరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రెగ్యూలర్‌గా చదువుకోలేని వారు ఇందులో చేరేందుకు ముందుకు రావాలని కోరారు. ఈ నెల 8 నుంచి సెప్టెంబర్ 10వరకు అడ్మిషన్లు కొనసాగుతాయని, అక్టోబర్‌లో 10వ తరగతి, ఇంటర్ తరగతులు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు హుస్నాబాద్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలోని కోఆర్డినేటర్ 9490297977గల సెల్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

దుబ్బాకలో డెంగీ.. స్పందించిన వైద్య సిబ్బంది

దుబ్బాక, ఆగస్టు 8 : దుబ్బాక మున్సిపాలిటీలో గురువారం డెంగీ కేసులు నమోదయ్యాయి. స్పందించిన వైద్య సిబ్బంది పలు వార్డుల్లో శిబిరాలు ఏర్పాటు చేశారు. ఆయా వార్డుల్లో తిమ్మాపూర్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. పరిసరాలలో దోమల నివారణకు మున్సిపల్ సిబ్బందితో ఫాగింగ్ చేపట్టి, ప్రజలకు ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించామని మున్సిపల్ కమిషనర్ రమేశ్‌కుమార్ తెలిపారు.

పాడి రైతుల బకాయి బిల్లులు చెల్లించాలి

కొమురవెల్లి, ఆగస్టు 8 : విజయ పాల కేంద్రంలో పాలు పోసే పాడి రైతుల బకాయి బిల్లులు వెంటనే చెల్లించి, వారి సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బీజేపీ మండలాధ్యక్షుడు బూర్గొజు నాగరాజు డిమాండ్ చేశారు. గురువారం కొమురవెల్లి మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాడి రైతులకు వెంటనే పాల బిల్లులను చెల్లించడంతో పాటు పశువులకు సబ్సిడీపై దాణా అందివ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు స్వాములపల్లి భిక్షపతి, ప్రధానకార్యదర్శి ఎక్కలదేవి మధుయాదవ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పబ్బోజు రాజు, యువమోర్చా మండలాధ్యక్షుడు సానాది కరుణాకర్, గణబోయిన శ్రీనివాస్, తిగుళ్ల మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

సుశ్రుత దవాఖానకు ఎన్ఏబీహెచ్ గుర్తింపు

ఎన్ఏబీహెచ్ సర్టిఫికెట్‌ను ఆవిష్కరిస్తున్న ఐఎంఏ అధ్యక్షుడు భాస్కర్‌రావు, మురళీకృష్ణ

సిద్దిపేట, ఆగస్టు 8 : సిద్దిపేట జిల్లాలోనే మొదటి సారి సుశ్రుత ఆర్థోపెడిక్ దవాఖానకు నేషనల్ అక్రిడిటేషన్ బోర్డు ఫర్ హాస్పిటల్స్ అండ్ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ (ఎన్ఏబీహెచ్) గుర్తింపు రావడంతో సంతోషం వ్యక్తం చేశారు. ఈ గుర్తింపు ద్వారా దవాఖానలో రోగుల భద్రత, హక్కుల, రోగులకు మెరుగైన వైద్యం, సదుపాయాల కల్పన, ఔషధ నిర్వహణ, పారదర్శకంగా మెడికల్ నిర్వహణ, అత్యవసర వైద్య సేవలు ఎల్లప్పుడూ అందుబాటులోకి వస్తాయని.. నిరంతరం నాణ్యమైన వైద్యం రోగులకు అందుబాటులో ఉంటుందన్నారు. ఎన్ఏబీహెచ్ సర్టిఫికెట్‌ను ఐఎంఏ అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కర్‌రావు, ఆర్థోపెడిక్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేంద్ర, డాక్టర్లు చంద్రారెడ్డి, రవికాంత్ రావు, కృష్ణమూర్తి, స్వామిగౌడ్, త్రివిక్రమ్‌ల సమక్షంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైద్యుడు మురళీకృష్ణకు అభినందనలు తెలిపారు. డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ.. మా సిబ్బంది అంకితభావంతో చేసిన టీమ్ వర్క్ ఐఎంఏ సహకారంతో ఇది సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో వైద్యులుగౌతమ్ సుశ్రుత్, శ్రీకాంత్, అమృత పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం అందజేత

మృతుడి కుటుంబసభ్యులకు ఆర్థికసాయం అందిస్తున్న స్నేహితులు

మద్దూరు (ధూళిమిట్ట), ఆగస్టు 8 : మండల పరిధిలోని కూటిగల్ గ్రామానికి చెందిన తుషాలపురం మంగ–మహదేవ్‌ల కుమారుడు సాయిరోహిత్ ఇటీవల అమెరికాలో అనుమానస్పద స్థితిలో మృతి చెందాడు. దీంతో మృతుడి తండ్రి మహదేవ్‌తో కలిసి 1988–89లో పదో తరగతి పూర్తి చేసిన స్నేహితులు గురువారం ఆయన కుటుంబాన్ని మరామర్శించి రూ.50వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో గందె మల్లేశం, ఇమ్మడి బాల్‌రెడ్డి, శంకర్, పోగుల అశోక్, నారదాసు బాలయ్య తదితరులు ఉన్నారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

సిద్దిపేట టౌన్, ఆగస్టు 8 : సెప్టెంబర్ 14న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవి అన్నారు. కోర్టు ఆవరణలో గురువారం పోలీస్, ఎక్సైజ్, రెవిన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో కక్షిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా రాజీ మార్గం ద్వారా వారి కేసులు పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. జడ్జీలు స్వాతిరెడ్డి, మిలింద్ కాంబ్లె, నాగచైతన్య, ఏసీపీలు,అధికారులు పాల్గొన్నారు.

కల్లుగీత కార్మికులు ఉద్యమించాలి

మద్దూరు (ధూళిమిట్ట), ఆగస్టు 8: సమస్యల పరిష్కారం కోసం కల్లు గీతకార్మికులు ఉద్యమించాలని కల్లు గీత కార్మిక సంఘం(కేజీకేఎస్) జిల్లా కార్యదర్శి బండకింది అరుణ్‌కుమార్ అన్నారు. గురువారం మద్దూరు మండల కేంద్రంలోని ఎల్లమ్మ ఆలయం ఆవరణలో మండల అధ్యక్షుడు పోతుగంటి లింగం అధ్యక్షతన అమరుల సంస్మరణ సభను నిర్వహించారు. అంతకుముందు కల్లు గీత కార్మికులు బైక్‌ర్యాలీని నిర్వహించారు. సమావేశంలో రాష్ట్ర నాయకుడు అనగోని నర్సింహులు, నాయకులు సత్తయ్య, కనకయ్య, శివయ్య, నర్సింహులు, శంకరయ్య, మల్లేశం, బాలయ్య, మల్లేశం, బూర్గు సాయిలు, రాజు తదితరులు పాల్గొన్నారు.

15 సెల్‌ఫోన్లు అప్పగింత

గజ్వేల్, ఆగస్టు 8: పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌లను సీఈఐఆర్ టెక్నాలజీ సహాయంతో గుర్తించి 15 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకొని గురువారం గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో ఏసీపీ పురుషోత్తంరెడ్డి బాధితులకు అప్పగించారు. కార్యక్రమంలో సీఐ సైదా, అదనపు సీఐ ముత్యంరాజులు పాల్గొన్నారు.

అంబులెన్స్ అపహరణ

సిద్దిపేట టౌన్, ఆగస్టు 8 : ఓ యువకుడు అంబులెన్స్‌ను అపరించుకెళ్లిన ఘటన సిద్దిపేట వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. పోలీసుల తెలిపిన వివరాలు.. రెబర్తికి గ్రామానికి చెందిన అశోక్ సిద్దిపేట ప్రభుత్వ దవాఖాన ఎదుట ఉన్న అంబులెన్స్‌ను ఎత్తుకెళ్లాడు. ఈ క్రమంలో అశోక్ రాజీవ్ రహదారి టోల్ గెట్‌వద్ద వాహన అదుపు తప్పి ప్రమాదానికి గురైంది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారించగా, తన సోదరి వద్దకు వెళ్లేందుకు అంబులెన్స్‌ను అపహరించానన్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

వయనాడ్ బాధితులకు ఆర్థిక సాయం

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 8 : కేరళ రాష్ట్రంలోని వయనాడ్‌లో ఇటీవల కురిసిన భారీ వర్షాలతో కొండ చరియలు విరిగి పడటంతో మృతి చెందిన కుటుంబాలకు సిద్దిపేట పట్టణానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు జాన్ వెస్లీ రూ.50 వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేరళ సీఎం రిలీఫ్ ఫండ్‌కు సంబంధిత సొమ్మును ఆన్‌లైన్ విధానంలో చెల్లించినట్లు ఆయన తెలిపారు.

విద్యార్థులకు మాక్ పోలింగ్

మిరుదొడ్డి, ఆగస్టు 8 : మిరుదొడ్డి మండలంలోని అందె జడ్పీ పాఠశాలలో విద్యార్థులకు ఎన్నికల సరళిపై ఉపాధ్యాయులు బుధవారం మాక్ పోలింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

కొమురవెల్లి, ఆగస్టు 8 :మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు మహిళా రక్షణ చట్టాలు, షీ టీమ్ ద్వారా ఎలా రక్షణ పొందవచ్చు.. సైబర్ నేరాలపై చేర్యాల సీఐ శ్రీను అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై రామ్మూర్తి, పాఠశాల ఇన్‌చార్జి హెడ్ మాస్టర్ తిరుపతిరెడ్డి, హుస్నాబాద్ షీటీమ్ బృందం సదయ్య, మహిళా కానిస్టేబుళ్లు స్వప్న, ప్రశాంతి, కానిస్టేబుళ్లు కృష్ణ, శివకుమార్ తదితరులు ఉన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం

మాట్లాడుతున్న ఆర్ఎం కృష్ణమోహన్

రాయపోల్, ఆగస్టు 8: బ్యాంకు ఖాతాదారులకు మెరుగైన సేవలను అందించడమే ప్రధాన లక్ష్యమని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వరంగల్ రీజనల్ మేనేజర్ కృష్ణమోహన్ స్పష్టం చేశారు. గురువారం ఆయన రాయపోల్ సెంట్రల్ బ్యాంకును తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరును గ్రామస్తులను ఖాతాదారులను ఆడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ చంద్రకాంత్ ఆజాద్, రాయపోల్ శాఖ మేనేజర్ సుమన్‌బాగే, అసిస్టెంట్ మేనేజర్ విద్య బ్యాంక్ క్యాషియర్ శ్రీకాంత్,ఏఎఫ్ ఓ ఆర్య,సిబ్బంది రమేష్ కాతాదారులు గ్రామస్తులు పాల్గొన్నారు.

సమష్టిగా కృషి చేయాలి

సిద్దిపేట అర్బన్, ఆగస్టు 8 : విద్యారంగంలో సిద్దిపేట జిల్లాకు ఓ ప్రత్యేకత ఉందని దానిని కొనసాగించేందుకు అందరూ సమష్టిగా కృషి చేయాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి రవీందర్‌రెడ్డి అన్నారు. గురువారం సిద్దిపేట జిల్లా ఇంటర్ కార్యాలయంలో రవీందర్‌రెడ్డి డీఐఈఓగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా డీఐఈఓ మాట్లాడుతూ.. ఇంటర్ విద్యలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు ప్రయత్నం చేస్తామని.. పేద విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని వారి భవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులందరూ నిబద్ధతతో పని చేయాలన్నారు. చదువులో వెనకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి మంచి ఫలితాలు సాధించి జిల్లాను మొదటి స్థానంలో నిలపాలన్నారు. అనంతరం జీజేఎల్ఏ, టీజీఎల్ఏ సభ్యులు డీఐఈఓను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

వల్లంపట్లలో పురాతన రాతి పూర్ణకుంభం చోరీ

మద్దూరు(ధూళిమిట్ట), ఆగస్టు 8: మండల పరిధిలోని వల్లంపట్లలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో గల వినాయకుడి ఎదుట ఉన్న పురాతన రాతి పూర్ణకుంభం బుధవారం రాత్రి చోరీకి గురైంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. బొర్రపోతనగా పిలిచే సుమారు ఆరడుగుల వినాయక విగ్రహంతో పాటు పూర్ణకుంభాన్ని కొన్నేండ్ల క్రితం గ్రామంలోని వేముల చెరువు దగ్గరి నుంచి తీసుకొచ్చి ఆంజనేయస్వామి ఆలయంలో ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి విశేషంగా పూజలు చేస్తున్నారు. గ్రామంలో ఉన్న రాతి పూర్ణకుంభం చాలా అరుదుగా ఉన్నాయని చరిత్రకారులు చెబుతున్నారు. అంతటి ప్రాధాన్యత కల్గిన రాతి పూర్ణకుంభం చోరీకి గురికావడంపై గ్రామస్తులు విస్మయాన్ని వ్యక్తం చేస్తున్నారు. రాతి పూర్ణకుంభం అడుగు భాగంలో గుప్తనిధులు ఉండవచ్చని పలువురు భావిస్తున్నారు. ఘటనా స్థలాన్ని మద్దూరు పోలీసులు సందర్శించి, వివరాలు సేకరించారు.

పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లు

చిన్నకోడూరు, ఆగస్టు 8 : మండలంలోని పెద్దకోడూరు మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు తీసుకుంటున్నామని ప్రిన్సిపాల్ స్నేహలత తెలిపారు. విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ నెల 8 నుంచి 11 వరకు దరఖాస్తులు స్వీకరించి 12న స్పాట్ అడ్మిషన్లు ఇస్తామన్నారు.

బ్యాంక్ ఆఫ్ బరోడా | సిద్దిపేట్ శాఖ, 8-1-44, కృష్ణారెడ్డి ఛాంబర్స్, సిద్దిపేట్-502 103, తెలంగాణ, ఇండియా.

డిమాండ్ నోటీసు

(SARFAESI చట్టం, 2002 యొక్క సెక్షన్ 13 లోని సబ్–సెక్షన్ (2) క్రింద)

బ్యాంక్ ఆఫ్ బరోడా అయిన మేము మీరు పేర్కొన్న చిరునామాలకు SARFAESI చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద దీనిలో తెలిపిన 29–05–2024తేదీగల డిమాండ్ నోటీసును జారీ చేశాము. మీరు పేర్కొన్న చిరునామాలలో లేనందున/నోటీసు వాపసు వచ్చినందున/సరిగ్గా ఎక్నాలెడ్జ్ చేయబడనందున ఈ పత్రికా ప్రచురణ జారీ చేయబడినది. సదరు నోటీసులోని అంశాల ప్రకారం మీకు మంజూరైన వివిధ రుణాలలోని బకాయిల చెల్లింపులో మీరు విఫలమైనారు. తదుపరి వడ్డీ, వ్యయాలు మొదలైన వాటితో బకాయి మొత్తం దిగువ తెలుపబడినది:

రుణగ్రహీత పేరు: శ్రీ మహమ్మద్ షఫియుద్దీన్, తండ్రి: మహమ్మద్ నసీరుద్దీన్, ఇం.నెం. 11–195/1, ఇందిరా నగర్, సిద్దిపేట్–502 103.
నిరర్థక ఆస్తిగా ప్రకటించిన తేది: 08-04-2024 **డిమాండ్ నోటీసు తేది: 29-05-2024**
బకాయి మొత్తం: టర్మ్ లోన్: రూ. 6,24,012/- (ఆరు లక్షల ఇరవై నాలుగు వేల పన్నెండు రూపాయలు మాత్రమే) ప్లస్ **08-04-2024** నుండి లెక్కించని వడ్డీ మరియు **ఓవర్ డ్రాఫ్ట్ రూ. 6,09,660/- (ఆరు లక్షల తొమ్మిది వేల ఆరు వందల అరవై రూపాయలు మాత్రమే)** ప్లస్ **01-04-2024** నుండి లెక్కించని వడ్డీ ప్లస్ ఇతర చార్జీలు, ఖర్చులు.

సెక్యూరిటీస్ సంక్షిప్త వివరణతో సెక్యూరిటీ అగ్రిమెంట్

శ్రీ మహమ్మద్ షఫియుద్దీన్కు చెందిన, సిద్దిపేట, ఇందిరా నగర్ వద్దగల సర్వే నెం. 1906లో 138.31 చ.గజాల విస్తీర్ణపు ఇంటి నెం. 18–11–195/1b, **ప్లాట్ సరిహద్దులు: ఉత్తరం:** శ్రీ రాజ్ మహమ్మద్ పోర్షన్, **దక్షిణం:** సుజాత ఇల్లు, **తూర్పు:** శ్రీ రాజ్ మహమ్మద్ పోర్షన్, **పడమర:** 19' రోడ్.

పైన తెలిపిన విధంగా చెల్లింపు చేయుటలో మీరు విఫలమైతే, వ్యయాలు, వాటి పరిణామాలకు పూర్తిగా మీ నష్టపూచీపై అన్ని లేదా ఏదైనా ఒకటి లేదా ఎక్కువ సెక్యూర్డ్ ఆస్తులపై సదరు చట్టంలోని నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టుట బ్యాంక్‌కు తప్పనిసరి అవుతుంది. చట్టం క్రింద **బ్యాంక్ ఆఫ్ బరోడా**కు లభించే అధికారాలలో ఉన్నవి: **(i)** సెక్యూర్డ్ ఆస్తిని రాబట్టుకొనుటకు లీజు, అసైన్‌మెంట్ లేదా విక్రయం ద్వారా బదిలీ చేయుటకు హక్కులతో సహా రుణగ్రహీత సెక్యూర్డ్ ఆస్తులను స్వాధీనం చేసుకొనుటకు అధికారం **(ii)** సెక్యూర్డ్ ఆస్తిని రాబట్టుకొనుటకు లీజు, అసైన్‌మెంట్ లేదా విక్రయం ద్వారా బదిలీ చేయుటకు హక్కులతో సహా సెక్యూర్డ్ ఆస్తి మేనేజ్‌మెంట్ చేపట్టుట మరియు **బ్యాంక్ ఆఫ్ బరోడా** ద్వారా సెక్యూర్డ్ ఆస్తి యొక్క ఏదేని బదిలీలో మీరు బదిలీ చేసినట్లుగానే బదిలీ చేసిన సెక్యూర్డ్ ఆస్తికి సంబంధించి లేదా అన్ని హక్కులు సంక్రమిస్తాయి. SARFAESI చట్టంలోని సెక్షన్ 13(13) ప్రకారం ఈ నోటీసు స్వీకరణ తర్వాత **బ్యాంక్ ఆఫ్ బరోడా** ముందస్తు వ్రాతపూర్వక సమ్మతి లేకుండా విక్రయం, లీజు లేదా ఇతర విధంగా (మీ వ్యాపార సాధారణ క్రమంలో కాకుండా) పైన తెలిపిన ఏవైనా సెక్యూర్డ్ ఆస్తులను మీరు బదిలీ చేయరాదని గమనించగలరు. SARFAESI చట్టంలోని సెక్షన్ 13(13)లో పేర్కొన్న విధంగా పై నిబంధనను పాటించకపోతే SARFAESI చట్టంలోని సెక్షన్ 29 క్రింద శిక్షించదగు అపరాధమవుతుంది. సదరు చట్టంలోని సెక్షన్ 13(2) ప్రకారం ఈ నోటీసు జారీ చేయబడినది. సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకొనుటకు అందుబాటులో గల సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13(8) నిబంధనలను గమనించవలసిందిగా రుణగ్రహీతకు తెలియజేయడమైనది.

తేది: 08-08-2024, ప్రదేశం: సిద్దిపేట్ సం/– అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ బరోడా